గురుకుల పాఠశాలల్లో సీట్ల కౌన్సెలింగ్

ప్రజాశక్తి-కాకినాడ

అంబేద్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలలలో ఐదో తరగతి, ఇంటర్ ప్రవేశాల కోసం 2024-2025 విద్యా సంవత్సరంలో మెరిట్ ప్రాతిపదికన అడ్మిషన్లు నిర్వహించామని జిల్లా సమన్వయాధికారి జి.వెంకటరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మిగిలిన ఖాళీలను ప్రవేశ పరీక్ష రాసి సీటు పొందని విద్యార్థినీ, విద్యార్థులకు, ప్రవేశ పరీక్ష రాయని విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్‌లో అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఐదో తరగతి, ఇంటర్‌లో చేరాలనుకునే విద్యార్థులు తమ ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలు, 10వ తరగతి మార్కుల జాబితాతో కౌన్సెలింగ్ జరిగే పాఠశాలకు ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు.

జిల్లా వ్యాప్తంగా కుండపోత

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- విద్యుత్ సరఫరాకు అంతరాయం

భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరి అవుతూ బయటకు అడుగు పెట్టాలన్నా సంకోచపడే పరిస్థితి. మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎండ వేడిమి తాళలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు పడుతున్న వేళ వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆకాశం మేఘావృతమై వర్షం ఉగ్రరూపాన్ని చూపించింది. శుక్రవారం మధ్యాహ్నం జిల్లావ్యాప్తంగా కుండపోత వర్షం కురిసింది.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ ఒక్కసారిగా మారిన వాతావరణంతో నగర ప్రజలు ఆనందానికి గురయ్యారు. ఆ ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. గాలులతో పాటు భారీ వర్షానికి ఉరుములు మెరుపులతో ఎడతెరపి లేకుండా కురిసింది. రెండు గంటలకు పైగా కురిసిన భారీ వర్షంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించిపోయింది. డ్రైనేజీలు పొంగి పొర్లాయి. భారీ గాలుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇక్కట్ల పాలయ్యారు. ఈదురు గాలులతో కూడిన కుండపోత వర్షం కురియడంతో నగరంలోని చాలా ప్రాంతాలు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ప్రధాన రహదారులన్నీ కూడా పూర్తిగా నీట మునిగాయి. ఆర్టిసి కాంప్లెక్స్, కార్పొరేషన్ కార్యాలయం, సినిమా రోడ్డు, మెయిన్ రోడ్డులోని సీతారామ ఆలయం వద్ద, నూకాలమ్మ గుడి వీధి, రామారావు పేట ఏరియా, భానుగుడి జంక్షన్, శాంతినగర్, పెద్ద మార్కెట్, రేచర్లపేట, గొడారిగుంట తదితర ఏరియాలతో పాటు చాలా ప్రాంతాలు కుండపోత వర్షానికి నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాల్లో రహదారి గుంతల్లో వర్షపునీరు నిలిచి మరింత ప్రమాదకరంగా మారాయి.

జగ్గంపేటలో కారు మబ్బులతో భారీ ఈదురు గాలులతో గంట పాటు వర్షం దంచి కొట్టింది. మండలంలోని పలు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీరు డ్రైనేజీలో ప్రవహించకపోవడంతో రోడ్లపై ప్రవహించింది. దళితపేట, పల్లపువీధి, మరికొన్ని లోతట్టు ప్రాంతాలు అన్నీ నీట మునిగాయి. సీతానగరంలో కొబ్బరి చెట్టు విరిగి ఒక ఇంటి మీద పడి విద్యుత్ వైర్లు తెగిపోయాయి.

తాళ్లరేవులో కుండపోత వర్షం పడింది. ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. పరదేశమ్మ వీధి పూర్తిగా నీట మునిగింది. పలు చోట్ల జగనన్న కాలనీలు పూర్తిగా నీట మునిగాయి.

కాజులూరు ఒక్కసారిగా వీచిన భారీ గాలులతో పలు గ్రామాల్లో విద్యుత్ వైర్లపై కొబ్బరి చెట్లు, చెట్ల కొమ్మలు పడ్డాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మామిడి పంట నేలరాలడంతో రైతులు వాపోతున్నారు. చేలల్లో మెరక పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

కోటనందూరు కోటనందూరు, కాకరపల్లి, అల్లిపూడి డి.పోలవరం, తుని పట్టణాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో రహదారులు మునిపోయాయి.

సామర్లకోట పరిసర ప్రాంతాల్లో భారీ వర్షలు కురిశాయి. లోతట్టు ప్రాంతాలైన పలు కాలనీలు జలమయం అయ్యాయి. జగనన్న కాలనీలో రహదారులన్నీ కాలువల్లా మారాయి. తెలుకుల వీధి, గాంధీ నగర్, ప్రెసిడెంట్ గారి వీధి, ఆర్టిసి కాంప్లెక్స్, నెంబర్-2 మార్కెట్ ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. పెద్దాపురంలోని నువ్వులగుంట, లూథరన్ హైస్కూల్ రోడ్డు, గౌరి కోనేరు, వారపు సంత ప్రాంతాలు జలమయం అయ్యాయి.

పిఠాపురం పట్టణంలో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. డ్రైనేజీలు పొంగి పొర్లడంతో రోడ్లపై నీరు నిలిచిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల చెట్లు విరిగి విద్యుత్ వైర్లపై పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మండలంలోని గోకివాడలో ఆర్.శ్రీనుకు చెందిన గేదెపై పిడుగు పడి మృత్యువాత పడింది.

కాకినాడ శాంతినగర్ మెయిన్ రోడ్డుపై మోకాలు లోతు నీరు

జగ్గంపేట మండలం సీతానగరంలో ఇంటిపై విరిగి పడ్డ కొబ్బరి చెట్టు

కాజులూరులో రహదారికి అడ్డంగా పడిన చెట్టు

తాళ్లరేవులో ధాన్యపు రాశులపై బరకాలు

పిఠాపురంలో గేదె మృత్యువాత

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-పిఠాపురం

ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ ముగిసేలాగా అన్ని రాజకీయ పార్టీలు పోలీసులకు సహకరించాలని, ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కళ్యాణ మండపంలో నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. పోలింగ్ రోజు నియోజకవర్గంలోని చెదురుమొదురు సంఘటనలు జరిగాయన్నారు. వాటిపై ఇప్పటికే కేసులు నమోదు చేశామన్నారు. జూన్ 4వ తేదీ కౌంటింగ్ రోజు కౌంటింగ్ ఏజెంట్, అభ్యర్థి తప్ప వేరే ఎవరూ కౌంటింగ్ కేంద్రాలకు రాకుండా వారి ఇళ్ల వద్దే ఉండాలన్నారు. ఇప్పటికే కౌంటింగ్‌కు సంబంధించిన అన్ని భద్రతాపరమైన చర్యలూ తీసుకున్నామన్నారు. గ్రామాల్లో కౌంటింగ్ రోజు ప్రశాంత వాతావరణం ఉండేలా ప్రజలు సహకరించాలని కోరారు. జూన్ 6వ తేదీ వరకు సెక్షన్ 144, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలులో ఉంటుందని తెలిపారు. ఎవరు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా నిబంధనలు అతిక్రమించకుండా పోలీసు వారికి సహకరించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికల కౌంటింగ్ కు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి కె.హనుమంతరావు, సిఐ శ్రీనివాస్, ఎస్ఐలు మురళీ మోహన్, గుణశేఖర్, బాలాజీ, స్వామి నాయుడు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి సతీష్ కుమార్

నిరసన వ్యక్తం చేస్తున్న క్లాప్ వాహన డ్రైవర్స్

జీతాల జాప్యంపై క్లాప్ డ్రైవర్స్ నిరసన

ప్రజాశక్తి-కాకినాడ

వేతనాల జాప్యంపై కాకినాడ నగర పాలక సంస్థ క్లాప్ వాహన డ్రైవర్స్ శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు ఇస్మాయిల్ మాట్లాడుతూ 2022 జనవరి నుంచి క్లాప్ వాహనాలు అమల్లోకి వచ్చాయని, నాటి నుండి ఏనాడూ 5వ తేదీ లోపు జీతాలు అందుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ జీతాలు నేటికీ అందకపోవడం పట్ల గురువారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. జిఒ నెంబర్ 7 ప్రకారం జీతాలు చెల్లించాలని కోరుకుంటున్నామన్నారు. సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు మాట్లాడుతూ జనవరి నెల నుండి పిఎఫ్, ఇఎస్ఐ కూడా జమ కాలేదన్నారు. స్వయంభూ ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యం చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. నగర పాలక సంస్థ అధికారులు జోక్యం చేసుకుని క్లాప్ వాహన డ్రైవర్స్‌కు జీతాలు ఇప్పించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సంతోష్, విక్టర్, రామారావు, దుర్గా ప్రసాద్, భద్ర, విజయ్, సత్య, గంగాధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్పాంజ్‌తో బొమ్మల తయారీలో శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో విద్యార్థులకు బొమ్మల తయారీ, పప్పెట్ షోపై శిక్షణ ఇచ్చారు. ప్రముఖ పప్పెట్ షో ఉపాధ్యాయులు పిల్లి గోవిందరాజు 4 నుంచి 10 తరగతుల విద్యార్థులకు పప్పెట్ షో, స్పాంజితో బొమ్మల తయారీలో శిక్షణ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బొమ్మల తయారీ, పప్పెట్ షోల నిర్వహణలో భారతదేశం ఎంతో ప్రాచుర్యం పొందిందన్నారు. ఈ పప్పెట్ కళారూపం ఇన్స్పిరేషన్‌తోనే చలనచిత్ర రంగం అభివృద్ధి చెందిందన్నారు. జంతు ప్రేమికుడు నవీన్ నాని మాట్లాడుతూ పర్యావరణం, జీవవైవిధ్య పరిరక్షణకు అందరూ కృషి చేయాలన్నారు. జీవవైవిధ్య పరిరక్షణలో జంతువులు, పక్షుల పాత్రను విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన కొన్ని జంతువులను, కొన్ని రకాల పక్షులను విద్యార్థులకు చూపించి వాటి జీవన విధానం, వాటి వల్ల సమాజానికి, మానవ జాతికి, ప్రకతికి కలిగే ఉపయోగాలు వివరించారు. ఈ శిబిరంలో చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్, అధ్యక్ష కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ,రొంగల అరుణ్ కుమార్, మంజుల, అమత, సాయి, బంగారం, మణికంఠ, నేహా, రేణుక, శ్రీజ, కె.రవి, కె.పవన్ తదితరులు సేవలందించారు.

స్పాంజి బొమ్మల తయారీలో విద్యార్థులకు శిక్షణ

ఉపాధి భువన యాప్‌తో అవస్థలు

ప్రజాశక్తి-తాళ్లరేవు

ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం అమలు చేస్తున్న భువన యాప్ వల్ల కూలీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు అన్నారు. సంఘం నాయకులు దుప్పి అదృష్టదీపుడు, మందనక్క తణుకు రాజుతో కలిసి శుక్రవారం ఆయన మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. భువన యాప్‌లో లోపాలను సరిదిద్దాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ. 300 వేతనం అందరికీ వచ్చే విధంగా ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని ఈశ్వరరావు డిమాండ్ చేశారు.

పెట్రోల్ లూజ్ అమ్మకాలపై చర్యలు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

పెట్రోల్ బంకుల్లో లూజ్ అమ్మకాలు చేస్తే వారిపై చర్యలు తప్పవని ఎంపిడిఒ నారాయణ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పెట్రోల్ బంక్ యాజమాన్యానికి, సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాల మేరకు పెట్రోల్ బంకుల్లో బాటిల్స్, ఇతర సామాగ్రిలో లూజ్ అమ్మకాలు నిర్వహించరాదని చెప్పారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి ఎంఎస్.భాస్కరరావు, పంచాయితీ కార్యదర్శులు, విఆర్‌ఒలు పాల్గొన్నారు

కౌంటింగ్ నిబంధనలపై అవగహన

ప్రజాశక్తి - జగ్గంపేట

ఎన్నికల కౌంటింగ్ నిబంధనలపై నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.శ్రీనివాసరావు అభ్యర్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. కౌంటింగ్ రోజు ఉదయం 6.30 గంటలకే అభ్యర్థులు, ఏజెంట్లు కాకినాడ జెఎన్‌టియుకు చేరుకోవాలన్నారు. 18 జనరల్ పోలింగ్ టేబుల్స్, 4 పోస్టల్ బ్యాలెట్ టేబుల్స్ ఉంటాయన్నారు. 9 రౌండ్లలో కౌంటింగ్ ఉంటుందని తెలిపారు. 18 టేబుల్స్ వద్ద 18 మంది ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. ఆర్‌ఒ టేబుల్ వద్ద అభ్యర్థి లేదా అభ్యర్థి ఏజెంట్ ఉండేవిధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు.

పోలీసుల మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్

ప్రజాశక్తి-కాకినాడ

జూన్ 4న ఎన్నికల లెక్కింపు నేపథ్యంలో ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్ సమక్షంలో పోలీసులు, ఎఆర్, క్విక్ రియాక్షన్ టీమ్ పెరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు పోలీసుల దృష్టికి వచ్చినప్పుడు, 144 సెక్షన్ అమల్లో ఉన్న సందర్భంలో ప్రజల శాంతి భద్రతల నేపథ్యంలో పోలీసులు ఏ విధంగా స్పందించాలి, అక్రమ జన సమూహాలను ఏ విధంగా చెదరగొట్టాలి అనే వ్యూహంలో భాగంగా ఈ మాక్ డ్రిల్ చేపట్టారు. అక్రమ జన సమూహాలను కంట్రోల్ చేయుటకు మొదట వార్నింగ్, వినకపోతే టియర్ గ్యాస్ ప్రయోగం, ఉద్రిక్త పరిస్థితుల్లో తనను తాను రక్షించుకుంటూ లాఠీఛార్జ్, అగ్నిమాపక సిబ్బంది సహకారంతో వాటర్ కెనాన్ ప్రయోగం, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్, అప్పటికీ పరిస్థితి అదుపులోకి రాని పక్షంలో ఫైరింగ్ వంటివి ఈ మాక్ డ్రిల్‌లో ప్రదర్శించారు. క్యూఆర్‌టి టీములను అన్ని నియోజకవర్గాల్లో నియమించి వారికి తగిన శిక్షణ ఇచ్చినట్లు ఎస్‌పి సతీష్‌కుమార్ తెలిపారు. ప్రతి నియోజకవర్గానికీ అవసరాన్ని బట్టి టీములను నియమించినట్లు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ విధ్వంసానికి ప్రయత్నించే అల్లరి మూకలను అణచి వేసేందుకు, అత్యవసర సమయంలో పరిస్థితిని అదుపులోకి తీసుకొని వచ్చేలా ప్రత్యేక టీములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ ఎఎస్‌పి డి.సత్యనారాయణ, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

15వ తేదీ లోపు డీ సిల్టేషన్ పూర్తి

ప్రజాశక్తి-కాకినాడ

జూన్ 15వ తేదీ లోపు డీ సిల్టేషన్ పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. నగరంలో ఎక్కడా వర్షపు నిలిచిపోకుండా చూడాలని సూచించారు. శుక్రవారం ఆయన ఎంహెచ్ఒ డాక్టర్ పథ్వీచరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో కలిసి నగరంలో పూడిక తీత పనులను పర్యవేక్షించారు. సుబ్బయ్య హోటల్, రామారావుపేట, పెద్ద మార్కెట్, పాత బిఎస్ఎన్ఎల్ కార్యాలయం, వార్ఫు రోడ్డు ప్రాంతాల్లో పర్యటించిన ఆయన పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. డీ సిల్టేషన్ పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. 14 శానిటరీ సర్కిల్స్ పరిధిలో ఇప్పటికే నాలుగు సర్కిల్స్‌లో పూడికతీత పనులు పూర్తయ్యాయని, మిగిలిన చోట్ల వివిధ దశల్లో ఉన్నాయని ఎంహెచ్ఒ డాక్టర్ పథ్వీచరణ్ కమిషనర్‌కు వివరించారు. ప్రధానమైన రైల్వే డ్రైన్, పెద్ద మార్కెట్ నుంచి వెళ్లే ప్రధాన డ్రైనేజీలపై దృష్టి సారించాలని కమిషనర్ సూచించారు.

ఆదిత్యలో ముగిసిన క్రీడా పోటీలు

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య క్యాంపస్‌లో మూడు వారాలుగా వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులకు నిర్వహించిన క్రికెట్, ఫుట్‌బాల్ పోటీలు శుక్రవారం స్నేహపూర్వక వాతావరణంలో ఉత్సాహంగా ముగిశాయి. ఎపిఎల్ పేరిట నిర్వహించిన క్రికెట్ పోటీల్లో 11 టీములు తలపడగా ఫైనల్ పోటీలో తలపడిన సూపర్ జైంట్ జట్టు, సూపర్ క్యాపిటల్స్ జట్ల మధ్య హోరాహోరీగా సాగిన పోటీలో సూపర్ జైంట్ జట్టు విజయం సాధించింది. సూపర్ క్యాపిటల్స్ జట్టు రన్నర్‌గా నిలిచింది. ఎఎఫ్ఎల్ ఫుట్ బాల్ పోటీల్లో 5 జట్లు పాల్గొనగా ఫైనల్ పోటీ కంజలి ఎఫ్‌సి, పల్కన ఎఫ్‌సిల మధ్య జరగ్గా కంజలి ఎఫ్‌సి విన్నర్‌గా పల్కన ఎఫ్‌సి రన్నర్‌గా నిలిచాయి. రెండు విభాగాల్లో విజేతలకు విన్నర్ జట్టుకు రూ.6000 నగదు, రన్నర్ జట్టుకు రూ.4000 నగదుతో పాటు ట్రోఫీలను ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి అందజేశారు. ఆద్యంతం పూర్తి నిష్పక్షపాతంగా అంపైరింగ్ బాధ్యతలను ఫిజికల్ డిపార్ట్మెంట్ విభాగం సభ్యులు నిర్వహించిన పోటీలు విజయవంతం కావడంలో సహకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీలు పూర్తి స్థాయి క్రీడా స్ఫూర్తితో ఎంతో రసవత్తరంగా సాగాయని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు.

సప్లిమెంటరీకి 77 మంది విద్యార్థుల గైర్హాజరు

ప్రజాశక్తి - సామర్లకోట

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షకు శుక్రవారం 77 మంది విద్యార్తులు గైర్హాజరైనట్టు ఎంఇఒ వై.శివరామకృష్ణయ్య తెలిపారు. మండలానికి సంభందించి మూడు పరీక్ష కేంద్రాలుగా సామర్లకోట పట్టణంలోని బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ ఉన్నత పాఠశాల, జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలను ఏర్పాటు చేశారు. మొదటి రోజు తెలుగు పరీక్షకు మూడు కేంద్రాల్లో మొత్తం 152 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా కేవలం 75 మంది మాత్రమే విద్యార్థులు హాజరయ్యారు. 77 మంది గైర్హాజరైనట్టు తెలిపారు.

స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన ఆర్‌ఒ

ప్రజాశక్తి-కాకినాడ

పిఠాపురం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి శుక్రవారం పిఠాపురం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో భద్రపరిచిన పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమును పరిశీలించారు. అనంతరం కాకినాడ జెఎన్‌టియుకె అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలో భద్రపరిచిన పిఠాపురం నియోజకవర్గ ఇవిఎంల స్ట్రాంగ్ రూము వద్ద భద్రతను పరిశీలించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోస్టల్ బ్యాలెట్, ఇవిఎంల స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఎప్పటికప్పుడు స్ట్రాంగ్ రూముల వద్దకు వెళ్లి అక్కడి భద్రత, నిఘా వ్యవస్థలను పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. నిరంతరం భద్రతా చర్యలను పోలీసులతో సమీక్షిస్తున్న తెలిపారు.

కార్టూ'నిజం'



వేట నిషేధ పరిహారం పెంచాలి

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

మత్స్యకారులకు ప్రభుత్వం అందిస్తున్న వేట నిషేధ పరిహారాన్ని రూ.20 వేలకు పెంచి అందుకోవాలని, వేట విరామ సమయంలో నిత్యావసర వస్తువులు అందించాలని ఎప మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యులు సిహెచ్.రమణి, జిల్లా నాయకులు సత్యనారాయణ డిమాండ్ చేశారు. అమీనాబాద్, ఉప్పాడ, కోనపాం పేటలో శుక్రవారం వారు మత్స్య కారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రూ.10,000 పరిహారం ఇచ్చి ఎంతో ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. 7,50,000మంది లబ్ధిదారులు ఉండగా గత సంవత్సరం 1,23,000 మందికి మాత్రమే పరిహారం ఇచ్చారని తెలిపారు. వేటకి వెళ్లే ప్రతి మత్స్యకారుడికి పెన్షన్‌తో ముడి పెట్టకుండా నిషేధ భతి అందించాలని రేషన్ కార్డులో ఇద్దరు ఉన్న వేట కెళ్లే అందరికీ భతి అందించాలని, డీజిల్ సబ్సిడీ రూ.20కు పెంచాలని డిమాండ్ చేశారు. సముద్ర తీరంలో ఉన్న మత్స్యకారులు నేటికీ అనేక మౌలిక సదుపాయాలకు దూరంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కె.సింహాచలం, బడే ప్రసాద్, ఉప్పరపల్లి లాజర్, జల్లా కృపారావు, నాగేష్, ఓసుపల్లి రాంబాబు పాల్గొన్నారు.

భృతి పెంచాలని డిమాండ్ చేస్తున్న నాయకులు, మత్స్యకారులు

ఊరకొండ హక్కులు గ్రామస్తులకివ్వాలి

ప్రజాశక్తి-కోటనందూరు

ఊరకొండ సర్వహక్కులు స్థానిక ప్రజలకే కల్పించాలని సిపిఎం తుని మండల కార్యదర్శి నకిల్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం తుని రూరల్ తేటగుంటలో పంచాయతీ పరిధిలో ఉన్న గవరపేటలో రిటైర్డ్ ఆర్మీ సిబ్బంది, స్థానిక ప్రజలు, రైతుల మధ్య వాగ్వివాదం రేగింది. 15 ఏళ్ల క్రితం అప్పట్లో ఆర్మీలో పనిచేస్తూ రిటైర్ అయిన సిబ్బందికి అప్పటి ప్రభుత్వం గవరపేటను అను ఆనుకొని ఉన్న ఊరుకొండపై స్థలాలను ఇచ్చి పట్టాలను మంజూరు చేశారు. శుక్రవారం కొంతమంది రిటైర్డ్ ఆర్మీ సిబ్బంది ఊరకొండను పొక్లెయినర్‌తో చదును చేస్తుండడంతో శ్రీనివాస్ దృష్టికి స్థానిక ప్రజలు, రైతులు తీసుకొచ్చారు. ప్రజలు, రైతులతో కలిసి శ్రీనివాస్ త్రవ్వకాలను అడ్డగించారు. దీంతో వాగ్వివాదం చోటు చేసుకోవడంత పోలీసులు వారిని సముదాయించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంతో కాలం నుంచి స్థానిక ప్రజలు, రైతులు, కొండమీద ఆధారపడి పశువులను, మేకలను మేపుకుంటున్నారన్నారు. వీరి నివాస గృహాలు కొండ దిగువన ఉండడంవల్ల అధిక వర్షాల సమయంలో ఇళ్లు నీట ముడిగినప్పటికీ మేరక ప్రాంతాల్లోనే చెట్ల కింద ఉంటారని చెప్పారు. రిటర్న్ ఆర్మీ సిబ్బందికి మరొక ప్రాంతంలో స్థలం ఇవ్వాలని ఆయన కోరారు.

తహశీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న శ్రీనివాసు తదితరులు

నేరాలు ఘోరాలు

మాజీ సర్పంచ్ ఆత్మహత్య

ఎంఎల్ఎ టిక్కెట్ రాలేదని సూసైడ్‌నోట్

ప్రజాశక్తి-రౌతులపూడి

మండలంలోని పారుపాక గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గాడి సూరకాశేశ్వరరావు శుక్రవారం గ్రామంలోని ఓ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్ఐ అబ్దుల్ నబీ తెలిపిన వివరాల మేరకు ఏ పార్టీ నుంచి తనకు ఎంఎల్ఎ టిక్కెట్ దక్కకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుని ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సూరకాశేశ్వరరావు 2006లో సర్పంచ్‌గా పనిచేశారు. 1999లో కాంగ్రెస్ నుంచి ఎంఎల్ఎ టిక్కెట్ కోసం ప్రయత్నించి భంగపడ్డారు. అలాగే 2009లో పిఆర్‌పి నుంచి, 2024లో వైసిపి నుంచి టిక్కెట్‌ను ఆశించి భంగపడ్డారు.

విద్యుదాఘాతంతో ఆవుల మృత్యువాత

ప్రజాశక్తి- ముమ్మిడివరం

పొలాల్లో మేస్తున్న రెండు ఆవులు శుక్రవారం రాత్రి విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డాయి. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ముమ్మిడివరం పోలీసులు తెలిపారు. మండలంలోని కొత్తలంక పంచాయతీ పరిధిలో గంగుల శంకర్ అతని చిన్నాన్న గంగుల గోవిందుకు చెందిన రెండు ఆవులను శుక్రవారం కాలువ గట్టు సమీపంలో పొలాల్లో మేస్తుండగా విద్యుత్ స్తంభం దగ్గరలోని ఒక విద్యుత్ తీగ తెగి వాటిపై పడింది. విద్యుదాఘాతానికి రెండు ఆవులు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. ఆవులతో వచ్చే ఆదాయంతోనే కుటుంబ పోషణ సాగిస్తున్నామని, వాటిమృత్యువాతతో జీవనోపాధి కోల్పోయామని బాధితులు వాపోతున్నారు. ఈ మేరకు ఎస్ఐ డి. సురేష్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

326 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి-కాట్రేనికోన

సుంకం చెల్లించని 326 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని కాట్రేనికోన ఎస్ఐ నాగేశ్వరావు తెలిపారు. బ్రహ్మసమేధ్యం పంచాయతీ బలుసుతిప్ప గ్రామంలో తనిఖీలు నిర్వహించామన్నారు. సంచుల్లో నిల్వ చేసిన సుంకం చెల్లించని 326 మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గ్రామానికి చెందిన పోతాబత్తుల కాసుబాబుపై కేసు నమోదు చేశామని తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.34,302 ఉంటుందని తెలిపారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది జి.మణికంఠ, కనక రాజు పాల్గొన్నారు.

ఆయిల్ ట్యాంకర్ సీజ్

ప్రజాశక్తి - తాళ్లరేవు

యానాం నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న నాలుగు వేల లీటర్లతో ఉన్న ఆయిల్ ట్యాంకర్‌ను విజిలెన్స్ అధికారులు గురువారం రాత్రి సీజ్ చేశారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ, సివిల్ సప్లయీస్ అధికారులతో కలిసి తాళ్లరేవు మండలంలోని పోలేకుర్రు గ్రామ సమీపములో ట్యాంకర్‌ను ఆపి తనిఖీ చేశారు. ట్యాంకర్‌లో 4వేల లీటర్ల డీజిల్‌ను గుర్తించారు. ఆ డీజిల్‌ను, డ్రైవర్ గోవల సుబ్బారావును అదుపులోకి తీసుకున్నారు. యానాంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో లీటరు రూ.84కు కొనుగోలు చేసి మోటార్, పైపు సహాయంతో ఆయిల్ ట్యాంకర్ వాహనాన్ని వేరొక వాహనంలోకి లోడు చేస్తుండగా పట్టుకున్నారు. అశోక్ లేలాండ్ ట్యాంకర్ కమ్ టాటా ఏస్ వాహనం యజమాని అడ్డాల వీరవెంకటసత్యనారాయణ ఆ డీజిల్‌ను తాళ్లరేవుకు రవాణా చేసి అక్కడ చేపలు, రొయ్యల చెరువుల మోటార్ ఇంజిన్లకు లీటరుకు రూ.88 లకు విక్రయిస్తున్నారని అధికారులు తెలిపారు. అక్రమంగా రవాణా చేస్తున్న డీజిల్ విలువ సుమారు రూ.8.39లక్షలు ఉంటుందన్నారు. ఈమేరకు కేసులు నమోదు చేశామని ఎంఎస్ఒ ప్రసన్న తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు జగన్నాథరెడ్డి, లక్ష్మీనారాయణ, డిఎస్ఒ ప్రసాద్, సిఎస్‌డిటి లక్ష్మీప్రసన్న, ఎఎస్ఒ రామణలక్ష్మిదేవి, లోవరాజు, శివ పాల్గొన్నారు. పట్టుబడిన ఆయిల్ ట్యాంకర్ తాళ్లరేవులోని శ్రీవీరసాయినాగేంద్ర ఏజెన్సీస్ హెచ్‌పి పెట్రోల్ బంకు వద్ద భద్రపరిచినట్లు తెలిపారు. నిందితులను జెసి కోర్టులో హాజరుపరుస్తామని ఎంఎస్ఒ తెలిపారు.

కాంట్రాక్ట్ వర్కర్స్‌ను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

చిన్నింపేట జీడిపిక్కల పరిశ్రమలో అక్రమంగా తొలగించిన 80 మంది కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం తహశీల్దార్ యలకుర్తి రంగారావుకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకుడు రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ జీడిపిక్కల పరిశ్రమ యాజమాన్యం అడ్డదారిలో యంత్రాలను తరలించుకుపోవడానికి ప్రయత్నించగా కార్మికులు అడ్డుకున్నారన్నారు. అప్పటినుండి పరిశ్రమ యాజమాన్యం వివిధ సాకులు చూపి 80 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారన్నారు. జిల్లాలో మిగిలిన జీడిపిక్కల ఫ్యాక్టరీలు లాభాలలో నడుస్తుంటే చిన్నింపేట పరిశ్రమకు మాత్రం ఎందుకు నష్టాలు వస్తాయని ఆయన ప్రశ్నించారు. నష్టాలను సాకుగా చూపి కార్మికులను తొలగించడం తగదన్నారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకుని పూర్తిస్థాయిలో కార్మికులకు ఉపాధి కల్పిస్తూ పరిశ్రమ కొనసాగించాలని లేనిపక్షంలో ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎస్.సాల్మన్‌రాజు, ఎం.కృష్ణమూర్తి, బి.నాని, సురేష్, నరేంద్ర ఉన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ఘనంగా సత్యప్రభ పుట్టినరోజు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రత్తిపాడు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి వరుపుల సత్యప్రభ పుట్టినరోజును కార్యకర్తలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆమెకు శుభాకాంక్షలు తెలిపి భారీ కేక్ కట్ చేయించారు. అనంతరం రాజన్న యువసేన సభ్యులు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. రాజన్న ఆశయ సాధనకు కషి చేస్తున్న సత్యప్రభ విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, రాజన్న యువసేన సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ధాన్యం వ్యాపారి నుంచి రూ.6 లక్షల చోరీ

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ధ్యానం వ్యాపారి నుంచి రూ.6లక్షలు నగదు చోరీ చేసి పరారయ్యారు. స్థానిక కొండప్ప వీధికి చెందిన ఎన్.నారాయణమూర్తి ధాన్యం వ్యాపారం చేస్తుంటారు. రైతులకు డబ్బులు ఇచ్చేందుకు శుక్రవారం పట్టణంలోని ఎస్‌బిఐ నుంచి రూ.6 లక్షల నగదును డ్రా చేశాడు. ఈ నగదును బ్యాగ్‌లో పెట్టుకుని తన ద్విచక్రవాహనంపై ఇంటికి పయనమయ్యాడు. సీతయ్య గారి తోట ప్రాంతంలోని హార్వెస్ట్ స్కూల్ వద్దకు వచ్చేసరికి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చారు. రూ.50 నోట్లు కిందపడిపోయాయి అంటూ నారాయణమూర్తికి తెలిపారు. కింద పడి ఉన్న డబ్బును తీసుకునే ప్రయత్నం చేసే సరికి నారాయణమూర్తి బండికి డబ్బులతో ఉన్న బ్యాగ్‌ను తీసుకుని వారు పరారయ్యారు. దీనిపై బాధితుడు పోలీసులకు పిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ఖరీఫ్ సాగుపై సిబ్బందికి అవగాహన

ప్రజాశక్తి-కోటనందూరు

ఖరీఫ్ వరి పంటల సాగుపై వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి పెద్దాపురం ఎడిఎ భ్రమరాంబిక ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భ్రమరాంబిక మాట్లాడుతూ భూసారాన్ని బట్టి రైతులు ఏ రకమైన విత్తనాలను వెయ్యాలి అనే దానిపై రైతులుకు అవగాహన కల్పించాలని, విత్తన శుద్ధి విధానాన్ని రైతులకు నేర్పించాలని, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. నారుమళ్లలో పెంట వేయడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడానికి రైతులకు మెలకువలు నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి కె.చంద్రశేఖర్, వ్యవసాయ విస్తరణాధికారి శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న భ్రమరాంబిక

కార్యవర్గానికి పలువురి అభినందనలు

ప్రత్తిపాడు బార్ కౌన్సిల్ కార్యవర్గం ప్రమాణం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నెల నాలుగో తేదీన ఎన్నికలు జరిగినప్పటికీ అధ్యక్ష పదవికి ఇద్దరు అభ్యర్థులకు చెరో 33 ఓట్లు రావడంతో ఎన్నికలు నిలిపివేసి ఎపి బార్ కౌన్సిల్‌కు నివేదిక పంపారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ తరపున ఎగ్జిక్యూటివ్ సభ్యులు మురహరిశెట్టి రవికుమార్ హాజరైన అధికారులతో చర్చలు జరిపారు. మొదటి ఆరు నెలలు అనిసింగరాజు కుక్కుటేశ్వరరావు, తరువాత ఆరు నెలలు రాజాల చిట్టిబాబు అధ్యక్షునిగా కొనసాగేందుకు రాజీ చేశారు. అందరి ఏకాభిప్రాయంతో నూతన దీక్షగా అనిసింగరాజు కుక్కుటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా బొంగుళూరి మధుబాబు, ఉపాధ్యక్షునిగా రామణం వీర వెంకటరావు, కోశాధికారిగా జొన్నాడ రాజేష్, సహాయ కార్యదర్శిగా పలివెల నాగేంద్ర రాజు, స్పోర్ట్స్ కార్యదర్శిగా లింగంపల్లి శివకుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యునిగా బత్తుల రవికుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ మాజీ అధ్యక్షులు చలంకూరి రామకృష్ణ, కొల్లా వీర్రాజు, చిట్టంశెట్టి పుల్లయ్య, బుగత శివన్నారాయణ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-గండేపల్లి

ఉపాధి కూలీలకు వేసవి సౌకర్యాలు కల్పించాలని డ్వామా పీడీ గంగాభవాని సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని నీలాద్రిరావుపేట తాళ్లూరు గ్రామాల్లోఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూలీలందరు కొలతలకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయించిన రూ.300 వేతనం పొందేలా పని చేయాలని, ఉదయం 5.30 గంటలకు హాజరై 10.30 గంటలకు పని ముగించాలని, తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ రెండు లీటర్ల తాగునీరు కూడా తెచ్చుకోవాలని, తలమీద రుమాలు ఎండ తగలకుండా చుట్టుకోవాలని తెలిపారు. కొత్త పనులుంటే ప్రతిపాదించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఉపాధి కూలీల నమోదు హాజరు శాతాన్ని మస్తర్లను తనిఖీ చేశారు. పీడీ వెంట ఎపిఒ గంగా భవాని, టిఎలు, ఎఫ్ఎలు ఉన్నారు.

29 నుంచి భీమేశ్వరాలయంలో దర్శనాల నిలిపివేత

ప్రజాశక్తి -సామర్లకోట

సామర్లకోట భీమేశ్వర స్వామి వారి ఆలయంలో యోగా లింగానికి జీర్ణోద్ధారణ మరమ్మతుల పనుల నేపథ్యంలో ఈనెల 29 నుంచి జూన్ 8వరకూ దర్శనాలను నిలిపి వేస్తున్నట్టు ఆలయ కార్యనిర్వాహణాధికారి బళ్ల నీలకంఠం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయాన్ని పది రోజులు పాటు జాతీయ పురావాస్తు శాఖకు అప్పగిస్తున్నట్టు తెలిపారు. పురావాస్తు శాఖ, రాష్ట్ర దేవాదాయ శాఖల ఉత్తర్వుల మేరకు ఈ పది రోజుల పాటు భీమేశ్వర స్వామి, బాలా త్రిపుర సుందరి అమ్మవారల ఉత్సవ విగ్రహాలకు ఆలయ నంది మండపంలో పూజలు నిర్వహించి భక్తులకు అక్కడే దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

ముంపు నివారణ చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నగర ముంపు నివారణకు జిల్లా యంత్రాంగం యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని పౌర సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. కాకినాడ నగరంలో శుక్రవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి క్లాస్ మాస్ ఏరియా తేడా లేకుండా స్మార్ట్ సిటీ సర్వం పూడిక ముంపు జలాలతో తల్లడిల్లిందని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణ రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పోరేషన్ వేసవి ఎండల ప్రారంభంలో చేయాల్సిన పూడిక తొలగింపు, తరలింపు పనులను మే నెలాఖ రులో చేపట్టడం వలన లక్షలాది రూపాయల నిధులు మురుగు పాలయ్యాయన్నారు. వీధి కాలువల్లో తీసిన పూడిక ఎక్కడిది అక్కడే ఉండి పోయిందన్నారు. వ్యర్థాల తరలింపు జరగలేదన్నారు. ప్రధాన రహదారుల్లో ఆర్ అండ్ బి క్రాస్ కల్వర్టుల దిగువ క్లీనింగ్ జరగలేదన్నారు. అవుట్ లెట్స్ క్లియరెన్స్ నిర్వహించ లేదన్నారు. రేచర్లపేట రైల్వే డ్రైన్, పిడబ్ల్యూడి కాలువ, చీడీలపోర మేజర్ డ్రైన్స్, సినిమా రోడ్ కవర్ స్లాబ్ డ్రెయిన్లు, ఉప్పుటేరు కాలువ ప్రవాహాల అడ్డగింపు ప్రక్షాళన చేపట్టలేదన్నారు. కార్పోరేషన్ ఆర్థికమాంద్యంతో పౌర సౌకర్యాల ముందస్తు ప్రణాళికలు స్తంభించి పోయాయన్నారు. రెవెన్యూ, పిడబ్ల్యూడి, నీటిపారుదల, మున్సిపాలిటీ, ఆర్ అండ్ బి తదితర శాఖల నడుమ సమన్వయం లేక ఈ పరిస్థితి తలెత్తిందన్నారు.

తాతపూడి లో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ పరదేశి

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు : ఎస్ఐ పరదేశి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జూన్ 4న జగనన్న ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎవరైనా సరే శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అంగర ఎస్ఐ అందే పరదేశి హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సెక్షన్ 144, 30 ఉన్నాయన్నారు. జిల్లా ఎస్ పి ఆదేశాను సారం గ్రామాల్లో పోలీస్ సిబ్బందితో ర్యాలీలు, అవగాహనా సదస్సులు నిర్వహిస్తూ శాంతి భద్రతలపై శుక్రవారం తాతపూడి గ్రామంలో నిర్వహించారు. ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని పోలీస్ శాఖ ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామాల్లో పోలీస్ ఇబ్బందితో కవాతు నిర్వహించారు. ర్యాలీలు, ఊరేగింపులు, సమావేశాలకు ఏ విధమైన అనుమతులు లేవన్నారు. ఇందుకు అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు, సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బందిపాల్గొన్నారు.

పల్లంకుర్రులో వ్యాన్ బోల్తా

ప్రజాశక్తి-కాట్రేనికోన

బొబ్బర్లంక - పల్లంకురు ప్రధాన పంట కాలువలోకి రైస్ మిల్లు వద్ద శుక్రవారం డిసిఎం వ్యాన్ బోల్తా కొట్టింది. చెరువులో పట్టిన చేపలు తరలించేందుకు వచ్చిన ఈ వ్యాన్ అదుపుతప్పి పంటకాల్వలోకి బోల్తా పడింది. ఆ సమయంలో డ్రైవర్‌తోపాటు, వ్యాన్‌పై మరొక యువకుడు ఉన్నట్టు తెలిసింది. ఎవరికి ఎటువంటి ప్రాణాపాయం జరగలేదు.

కాలువలో బోల్తాపడిన వ్యాన్

మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటరావు

యుద్ధప్రాతిపదికన పైపులైన్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ అచ్చంపేట-ఉండూరు సమీపంలో పైపులైన్ మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ జె..వెంకటరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆయన పైపులైన్ మరమ్మతు పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామర్లకోట నుంచి శశికాంత్‌నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్‌కు వెళ్లే ముడినీటి సరఫరా పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడ్డాయన్నారు. వీటిని అరికట్టేందుకు ఈ నెల 23, 24, 25 తేదీల్లో మరమ్మతు పనులు చేపట్టామన్నారు. 1 నుంచి 13వ డివిజన్ వరకు అంటే శశికాంత్‌నగర్, శ్రీవిద్యకాలనీ, భాస్కర్‌నగర్, దుమ్ములపేట, సాంబమూర్తినగర్, ఏఎంజీ స్కూల్, శ్రీనివాస బ్యాంక్‌కాలనీ, గైగోలుపాడు ప్రాంతాలకు నీటి సరఫరాను నిలిపివేసి మరమ్మతులను చేపట్టామన్నారు. శుక్రవారం కురిసిన భారీవర్షం కారణంగా పైపులైన్ మరమ్మతు పనులకు అంతరాయం కలిగిందని, ఈ నెల 26, 27 తేదీల్లోనూ ఆయా ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదన్నారు. ప్రజలు మంచినీటి కోసం ఇబ్బందిపడకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నామన్నారు. నగరపాలక సంస్థకు చెందిన ఆరు ట్యాంకర్లతోపాటు మరో ఆరు అద్దె ట్యాంకర్లను కూడా రప్పించామన్నారు. ఎక్కడైనా మంచినీరు సమస్య ఎదురైతే మొబైల్ నెంబర్లు 9849906507, 9959799138, 9676770461, 9848471415 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 94432
కాకినాడ, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99189

జర్నలిజం పట్ల ఆసక్తి, సామాజికస్పృహ ఉన్నాయా?
విన్నదీ కన్నదీ పది మందితో
పంచుకుందామనుకుంటున్నారా?
ప్రజాశక్తి
మీరు జర్నలిస్టు కాదలచుకున్నారా!
దినపత్రికలో పనిచేసేందుకు
క్రింది తెలిపిన కేంద్రాల్లో విలేకర్లు కావలెను
రాజమండ్రి, రాజమండ్రి సిటీ
రాజమండ్రి క్రైం, రంగంపేట, అనపర్తి
రాయవరం, పి.గన్నవరం
రావులపాలెం, అల్లవరం
మలికిపురం, సఖినేటిపల్లి, మండపేట
కె.గంగవరం, కాకినాడ సిటీ, కాకినాడ క్రైం
గొల్లప్రోలు, తుని, తుని రూరల్
తొండంగి, ప్రత్తిపాడు
విలేకరులు కావలెను
విలేకర్లకు అర్హత
ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజం పట్ల ఆసక్తి, సమస్యల పట్ల అవగాహన
ఇంటర్వ్యూ జరుగు తేదీ:
ది.30-05-2024
మంగళవారం
ఉదయం
10 గంటలకు
:: స్థలం ::
ప్రజాశక్తి కార్యాలయం,
ఇండస్ట్రియల్ ఎస్టేట్, స్వరూప్‌నగర్
లాలాచెరువు, రాజమండ్రి
సంప్రదించాల్సిన నెంబర్లు
92918 01804, 94900 99169

ఇరిగేషన్ స్థలాల్లో కనుమరుగవుతున్న పచ్చని చెట్లు

ప్రజాశక-ఆత్రేయపురం

ఇరిగేషన్ స్థలాల్లో పచ్చని చెట్లు కనుమరుగవుతున్నాయి. ఇరిగేషన్ సిబ్బంది చూసి చూడనట్లు వ్యవహరించడంతో రాత్రికి రాత్రే చెట్లు మాయవడంపై ప్రకృతి ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో ఆహ్లాదంగా ఉండే లొల్ల లాకులు పచ్చని చెట్లు కనుమరుగ అవడంతో ప్రకృతి ప్రేమికులు ఆవేదన చెందుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు ఇటీవల కాలంలో మెయిన్ కరెంట్ లైన్లు వేయడంతో వారికి అడ్డువచ్చిన చోట చెట్లు కొమ్మలను తొలగిస్తున్నారు ఇదే అదనగా కొంతమంది దుండగులు రాత్రికి రాత్రే చెట్లు నరికి వేస్తున్నారు ఉదయం చూసేటప్పటికి చెట్లు మాయమైపోతున్నాయి. ఒకపక్క పచ్చదనం కరిగిపోయి భూతాపం పెరిగిపోతుంది దీంతో కొద్దిపాటి ఎండకే ప్రజలు అల్లాడిపోతున్నారు. గతంలో మధ్య డెల్టా పరిధిలోగల ప్రధాన లాకులు వద్ద సినిమా షూటింగులు ఎక్కువగా జరిగాయి. ఈ ప్రాంతమంతా పచ్చని చెట్లు కొనుమరుగయ్యాయి. ఇక్కడ పరిసర ప్రాంతాలు ప్రకృతి హీనంగా తయారవడంతో రాను రాను షూటింగులు జరగడం లేదు. టూరిస్టులు రాక రోజురోజుకి తగ్గుతోంది. ఇరిగేషన్ మరియు విద్యుత్ శాఖ అధికారులను అడిగితే మేము ఎటువంటి చెట్లను తొలగించలేదంటూ చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలగజేసుకుని పచ్చని చెట్లను పరిరక్షించి పర్యావరణను పరిరక్షించాలని ప్రకృతి కాపాడాలని పలువురు కోరుకుంటున్నారు.

అక్రమార్కులు నరికేసిన పచ్చని చెట్లు

బుద్ధ జయంత్యోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమలాపురం

ఈనెల 26న ఆదుర్రులో నిర్వహించే బుద్ధ జయంతోత్సవాల సంబంధించిన కరపత్రాన్ని అల్లవరంలో ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం సంఘ సభ్యులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవాల నిర్వహణ కమిటీ ట్రెజరర్ ఉపాసక భయ్యా మోహనరావు మాట్లాడుతూ 26న ఉదయం 9 గంటల నుండి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షులు బత్తుల నకులరాజు ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు, ఆర్థిక కార్యదర్శి సాధనాల సత్యనారాయణ, ఉపాధ్యక్షులు నేరేడిమిల్లి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి గెడ్డం ప్రదీప్, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ సప్లమెంటరీ పరీక్షకు 594 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

పదవ తరగతి సప్లమెంటరీ తెలుగు పరీక్షలకు సంబంధించి జిల్లాలో 987 మంది విద్యార్థుల హాజరు కావలసి ఉండగా 393 మంది విద్యార్థుల పరీక్షలకు హాజరైనట్లు శుక్రవారం డిఇఒ ఎం.కమల కుమారి తెలిపారు. జిల్లాలో వీరి కోసం 16 సెంటర్లు ఏర్పాటు చేయగా 393 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 594 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని అన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ 9 పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు చేయగా డిఇఒ ఎం.కమల కుమారి 4, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఎం.సురేష్ 3 పరీక్ష కేంద్రాల్లోనూ తనిఖీలు నిర్వహించారు. కాగా ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ బాలికొన్నత పాటశాల కేంద్రంలో 64 మందికి 20 మంది విద్యార్థులు హాజరుకాగ 44 మంది గైర్హజరయ్యారని ఎంఇఒ బి.రమణశ్రీ తెలిపారు.

మహారాజశ్రీ అనపర్తి సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో...
ఓ.ఎస్.నెం. 147/24

బిట్వీన్
కొవ్వూరి వీర్రాఘవరెడ్డి - వాది
తండ్రి పెద్దారెడ్డి, డో.నెం. 5-7/3, బలభద్రపురం గ్రామం, బిక్కవోలు మండలం,
మరియు
1) పాండ్రంకి వెంకన్న, -ప్రతివాదులు
తండ్రి సూర్యారావు, డో.నెం. 8-15, బలభద్రపురం, బిక్కవోలు మండలం
2) పాండ్రంకి కుమారి, భర్త వెంకన్న, డో.నెం. 8-15, బలభద్రపురం, బిక్కవోలు మండలం
3) పాండ్రంకి ప్రసాద్, తండ్రి వెంకన్న, డో.నెం. 8-15, బలభద్రపురం, బిక్కవోలు మండలం
4) సియాదుల మంగ, భర్త సియాదుల సత్తిబాబు, డో.నెం. 8-3, తాతానగరం, బలభద్రపురం, బిక్కవోలు మండలం

పబ్లిక్ నోటీస్

పై నెంబరు దావాలో 1 నుండి 3 ప్రతివాదులు వాది ప్రోనోటు బాకి ఎగవేయడానికి నాలుగవ ప్రతివాదికి యీ దిగువ షెడ్యూలు దాకల ఆస్తిని ప్రతిఫలం లేకుండా అన్యాయంగా బదిలిచేసినారు. ఇంకా ఎవరైనా 1 నుండి 3 ప్రతివాదుల బాకీదారులు ఎవరైన ఉన్నయెడల ది.15-7-2024 సం.తేదీన ఉదయం 10.30 ని॥లకు పై కోర్టు వారి ముందు స్వయముగా కాని, లాయరు గారి ద్వారా గాని వచ్చి మీ అక్షేపణలు తెలియజేసుకోవలెను.

షెడ్యూలు

తూ.గో.జిల్లా, బిక్కవోలు మండలం, బలభద్రపురం గ్రామం సర్వే నెం.261/1లో పాత 9బ్లాక్‌లో, కొత్త 8 బ్లాక్‌లో డో.నెం. 8-22 బంగాళ పెంకిటిల్లు 145 1/4 చ.గ.వున్న ఇంటికి సరిహద్దులు.
తూర్పు : 60 లింకులు శెట్టి బలిజ కొండయ్యగారి స్థలం
పడమర : 60 లింకులు 5 గ॥ వెడల్పు వీధి
ఉత్తరం : 50 లింకులు పాండ్రంకి సూరిబాబు గారి స్థలం
దక్షిణం : 50 లింకులు పాండ్రంకి అప్పారావు గారి స్థలం
సమస్త ఈజిమెంట్ హక్కులతో సహా
కోర్టువారి ఆర్డర్ మేరకు)

కె.వి.సుబ్బారెడ్డి
కె.భాను శిరీష,
వాది తరపు న్యాయవాదులు
అనపర్తి
23-05-2024
9949035905

మహారాజశ్రీ 1వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
E.A. No. 10/2022
E.A. No. 41/2021
E.P. No. 283/2008 in
O.S. No. 98/2003

Between:
Velugubanti Surya Chakram, W/o. Atchanna, Hindu, aged 50 years, Gokavaram V & Mandal.
...Petitioner/ Decree Holder
AND
Chintala Gangamma @ Parvathi (died) and Others ***...Respondents/ JDrs***
3. Chintala Appa Rao, S/o. Dalayya, Hindu, aged 65 years, Velampeta, Gokavaram V & Mandal.
4. Chintala Baburao (died) his wife Chintala Ramana, Hindu, aged 55 years, West Gonagudem, Near Electricity Office, Korukonda Mandal.
5. Reddy Ramana (died) W/o. Reddy Veerraju, Husband of deceased Ramana, Velampeta, Gokavaram, Gokavaram (M), Hindu, aged 45 years, Gokavaram.
6. Chintala Satyanarayana (died) wife of Chintala Kumari, Hindu, aged 40 years, Dasari vari Veedhi, Gokavaram, Gokavaram Mandal.
...3, 4, 5, 6 Respondents/ JDrs

పై నెంబరు గ్రంధంలో 3, 4, 5, 6 రెస్పాండెంట్స్/ జె.డి.ఆర్స్ అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది. 19-6-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై గ్రంధంలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు గ్రంధంను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

సలాది శ్రీనివాసరావు
అడ్వకేట్, రాజమండ్రి
సెల్: 9849197731
రాజమండ్రి
24-5-2024